

# మనలోని మనిషి

## -కె.వి.యస్. వర్మ

గౌరవనీయులైన ఎడిటర్ గారి
దివ్యసముఖమునకు-
హృదయ పూర్వక నమస్కారాలు

నా ఈ ఉత్తరం మీరు చదువుతారో లేదోనని మొదట సందేహించాను. అయితే, నేనూ, నా కారణంగా ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితిని బట్టి మీరు దీన్ని తప్పక చదువుతారని నాకనిపించింది.

నేను పోలీస్ కానిస్టేబుల్‌గా చేరి నిన్నటికి ఆరేళ్ళయింది. నేనెంతో ఆసక్తితో ఈ ఉద్యోగంలో చేరాను. స్కూలు చదువు నుంచీ ఆటల్లో బాగా రాణించాను. నేను గిరిజనుణ్ణి కూడా కావడంతో నాకీ ఉద్యోగం సులువుగా వచ్చింది. ఉద్యోగంలో చేరిన రోజున నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

నాలుగు రోజులు గడిచేటప్పటికి నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. పై ఆఫీసర్ నుంచి నా సహోద్యోగి వరకూ నన్ను అంటరానివాడిగా చూస్తూ, అవహేళన చేస్తూ వుంటే మొదట్లో నా కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. బాధగానూ వుండేది. కోపంగానూ వుండేది.

నేను కానిస్టేబుల్‌గా చేరిన మరునటి సంవత్సరమే నాకు పెళ్ళయింది. నా భార్య సత్యవతి కాస్త చదువుకున్నదే. నా బాధనూ, ఆవేదననూ, నా ఉద్యోగ పరిస్థితులనూ ఆమె దగ్గర వెళ్ళబుచ్చుకునే వాణ్ణి. నాకామె భార్యే కాదు, మంచి స్నేహితురాలు కూడా.

“మీరు కోరుకున్నట్టుగా మంచిగా బతికే పరిస్థితులుంటే మీరింతగా బాధపడాల్సిన పని వుండేది కాదు. అలా లేనప్పుడు, మీరు రాజీ పడడం ఒక మార్గం. అది చేయలేనప్పుడు మీరు మీరనుకున్నట్టుగా ముందుకు సాగండి. ఎలాంటి పరిస్థితులెదురైనా, ఎలాంటి ఫలితాలొచ్చినా వాటికి తట్టుకునే శక్తిని అలవర్చుకోండి. నిజానికి నాకూ కొన్ని పరిస్థితులు ఎదురవుతున్నాయి. మన క్వార్టర్స్‌లోని మీతోటి ఉద్యోగుల భార్యల ఆడంబరాలూ, అహంభావాలూ నన్ను కించపరుస్తున్నాయి. ‘మీ ఆయన మరీ సత్తెకాలపోడు, అందుకే మీరిలా వున్నార’ని ఒకామె అంటే, ‘మా ఆయన ఫ్రిజ్ కొన్నాడు చూద్దువుగాని రమ్మని’ మరొకామె, ‘మా వారు గాద్రెజ్ బీరువా కొన్నారు చూద్దువుగాని రమ్మ’ని మరొకావిడ! నాకవి చిరాకు కలిగించే పరిస్థితులు. అంతేకాదు, అన్యాయంగా అలాంటివి సంపాదించుకోవాలన్న కోరిక నాకు లేదు. కష్టమైనా నష్టమైనా మీరు మీకిష్టమైన మార్గంలో నడవండి. నా తోడ్పాటు మీకెప్పుడూ వుంటుంది” అంది సత్యవతి ఒకనాడు.

ఆమె మాటలు నాకెంతో గుండె ధైర్యాన్ని

చ్చాయి. నన్నర్థం చేసుకునే ఓ మనిషి అండగా వుందనే భావం నన్నెంతో ఉత్తేజపరిచింది.

ఓ రోజున మా ఎస్.ఐ. దొర (ఎస్.ఐ. గాదు అనడం సబబు- అయితే, అప్పటి నా పై అధికారిని ఎలా సంబోధించే వాడినో ఇప్పుడూ అలాగే సంబోధించడం సంస్కారం అనే ఉద్దేశంతో అలా రాస్తున్నాను). 'పీటర్ స్కాట్' బాటిల్ తెమ్మన్నారు. నేనలాగే నిలబడ్డాను, డబ్బుల కోసం. ఆయన నా వంక చూస్తూ, "ఏంటలా నిలబడ్డావు ఫూల్. వెళ్ళి నే చెప్పింది తీస్కురా. ఏ షాపులో నా పేరు చెప్పినా ఇస్తారు." అని గద్దించారు. నాకది మొదటి అనుభవమేమో అంతా అయోమయంగా వుంది. అయినా చేసేది లేక ఆయన రూమ్ నుంచి బయటికొచ్చాను. ఫ్రీగా పీటర్ స్కాట్ బాటిల్ తేవడానికి నాకు మనస్కరించ లేదు. రెండ్రోజుల క్రితమే జీతం అందుకున్నా నేమో, నా దగ్గరున్న డబ్బుతో కొని తెచ్చాను (ఒక కానిస్టేబుల్ జీతమెంతో, పీటర్ స్కాట్ ఫుల్ బాటిల్ ధర ఎంతో మీకు తెలియంది కాదు). ఆ రోజు మా ఎస్.ఐ. దొర ఇంటి దగ్గర నాకు శివరాత్రి జాగరణే అయింది. ఆ రాత్రి తొమ్మిదింటికనుకుంటాను- ఆయన నన్ను పిల్చి "ఒరే ఫూల్. ఏట్రా బెల్లం కొట్టిన రాయిలా అలా నిలబడ్డావు. వెంటనే రాఘవమ్మ కంపెనీకెళ్ళి......" అన్నారు.

నాకంతా ఏమిటోగా వుంది. గబగబ బయటి కెళ్ళాను. ఏం చేయాలో తోచక, తిన్నగా పోలీస్ స్టేషన్‌కెళ్ళాను. అక్కడున్న కానిస్టేబుల్‌తో విషయం చెప్పి "నాకిదంతా కొత్త. కాస్త సాయం రా" అని బతిమలాడి అతని వెంట వెళ్ళాను.

"మీ దొర చెప్పాక మీకు తప్పుతుందా, మాకు తప్పుతుందా" అని వేళాకోళం, నిష్ఠూరం కలిపి నవ్వింది రాఘవమ్మ.

"ఏరా బెదురుగొడ్డా, ఎంటనే ఆళ్లనేసు కుని ఎళిపోతావా? నాతోపాటు నువ్వూ కాసింత ఎంగిలి పడతావా" అని అడిగాడు నా తోటి కానిస్టేబుల్.

'నన్నొదిలే'మన్నట్టు, ఓ నమస్కారం పెట్టి రిక్షా వెనక బయల్దేరాను. ఇందాక నా డబ్బుతో 'మందు' తెచ్చిచ్చాను. 'డబ్బు పోతే పోయింది నేను లంచగొండిని కాలేదు' అని సంతోషిం చాను. నన్ను నేను మోసం చేసుకుంటున్నానని ఆ వెంటనే నాకనిపించింది. ఇప్పుడు చేస్తున్న పనేమిటి? దీన్నేమనాలి? నా పై అధికారి చెప్పిన పని చేశానని తృప్తి పడాలా? ఈ పని కూడా నా ఉద్యోగంలో భాగమని సరిపెట్టుకోవాలా? నా




మీద నాకే అసహ్యమనిపించింది. 'ఆఫ్టరాల్ కానిస్టేబుల్ గాణ్ణి. నేనేం చేయగలను' అని సర్దుబాటు చేసుకో బోయాను. నా తరం కాలేదు.

ఆ మర్నాడు కాస్త లేటుగా స్టేషన్‌కెళ్లాను. రాత్రంతా నిద్రలేదేమో కళ్ళు మండిపోతు న్నాయి.

ఎస్.ఐ. దొరగారు పిలిచారు.

"ఏరా, మొద్దునాకొడకా, ఒళ్లెలా వుంది? ఇప్పుడా రావడం? అందరికీ టాంటాం వేస్తావురా లం... కొడకా..." అంటూ నన్ను బూతులు తిట్టారు.

నే చేసిన తప్పేమిటో నాకు తెలియలేదు. ఆయన చెప్పినట్టే చేశాను కదా. ఇప్పుడెందు కాయన తిడుతున్నారో నాకు బోధపడలేదు. తలొంచుకుని బయటకొచ్చేశాను. రాత్రి నాకు తోడుగా తీసుకెళ్ళిన కానిస్టేబుల్ నన్ను చూసి అదోలా నవ్వుతూ, "ఏం ఫీల్ కాకు, ఇలాంటివి మామూలే" అన్నాడు. అప్పుడు విషయం నాకర్థమయింది. వీడే ఎస్.ఐ. దొరగారికేదో చెప్పాడనుకున్నాను.

రోడ్డు మీద కొచ్చేటప్పటికి కానిస్టేబుళ్లూ, హెడ్ కానిస్టేబుళ్లూ, ఎస్.ఐ.దొరలూ తామేదో ఆకాశం మీంచి దిగొచ్చినట్టు ప్రవర్తించడం నాకాశ్చర్యం అనిపించేది. జనం అంటే ఎంత చిన్నచూపో! పోలీసుకు తెలుగులో రక్షక భటుడని పేరు. మాలో నూటికి తొంభై మందిమి అలా వుండకపోవడం వల్లే మమ్మల్ని ఎవరూ రక్షక భటుడని పిలవడం లేదని అనిపిస్తోంది.

రోజులు గడిచేకొద్దీ నా తోటి వాళ్ళ మీద అసహ్యం పెరిగిపోతోంది. నా మీద నాకే విపరీతమైన జాలి కలుగుతోంది. ప్రతి క్షణం నేనీ ఉద్యోగంలో ఎందుకు చేరానా అనిపిస్తోంది. నేను స్టేషన్లో ఒంటరివాడినయ్యాను. నన్నం దరూ ఓ పురుగులా చూస్తున్నారు. ఎస్.ఐ. దొరగారికి నా మీద మరీ కోపంగా వుంది. నా ముఖం చూస్తూనే ఆయన రుసరుసలాడ్డం మొదలెట్టారు. అందుకు మరో కారణం కూడా తోడయింది.

ఆ రాత్రి తలచుకుంటేనే నాకు గగుర్పాటు కలుగుతోంది. ఎనిమిదయ్యింటుంది. తులసమ్మ అనే ఆవిడ మా స్టేషన్‌కొచ్చింది. ఆ మొహం చూస్తే, అంతవరకూ ఏడ్చి వచ్చి నట్టుంది. మెడలో నల్లపూసల తాడుంది. చేతులకు మట్టి గాజులు వున్నాయి. వయస్సు ముప్పైలోపే వుండొచ్చు. మనిషి అందంగా, గౌరవ భావం కలిగేట్టుగా వుంది.

"ఏంటమ్మా సంగతి" అని అడిగాను.

"నువ్వుండ్రా ఆడారీ. ఏటిసయం? నీ పేరేటి? నీ కొచ్చిన కష్టవేటి?" మా హెడ్ కానిస్టేబుల్ ప్రశ్నలేయడం మొదలెట్టాడు.

"నా కష్టవేటని చెప్పను అన్నా. మా ఇంటాయన రోజూ తాగొచ్చి కొడతన్నాడు. పదేళ్ళ నుంచీ బరిస్తున్నాను. ఈ మద్దిన తాగుడు మరీ ఎక్కువైపోనాది. కూల్డబ్బులన్నీ సారాయికే తగలేత్తన్నాడు. నా రెక్కల కష్టం మీదే సంసారం గడుపుతున్నాను. ఆడేమో నా రెక్కల కష్టాన్ని కూడా సారాయికి గుంజేసి కుంటున్నాడు. ఇలాగయితే కుటుంబవు ఎలా గడుస్తాది చెప్పు. పైగా నేనిప్పుడు వట్టి మణిసిని గూడా కాదు," అని ఉబుక వస్తున్న కన్నీళ్లను పైట చెంగుతో తుడుచుకుని,

"అన్నా, నీకు నమస్కారం బెడతా. ఎట్టాగయినా ఆడికి బుద్ది చెప్పి, తాగుడు జోలికి పోకుండా మాడన్నా. మా ఇంటి పక్కోళ్ళు ఎంత చెప్పినా ఇనలేదు. నువ్వు కొంచెం బయం జెపితే, ఆడింటాడు. నువ్వే నా ఇలవేలపనుకుంటా" అంది తులసమ్మ.

మా హెడ్డుగారు తలపంకించి,

"నీ మొగుడి పేరేటి" అని అడిగారు.

కొద్దిగా సిగ్గుపడుతూ చెప్పింది. ఇల్లెక్కడో చెప్పింది.

"ఒరే ఆడారీ, అలా గుడ్లప్పగించి మాస్తావేరా, బేగెళ్ళి, ఆ నాకొడుకున్ట్రా. జల్దీగా రావాల" అని నాతో అన్నారు మా

హెడ్డుగారు.

నేను కదిలాను.

"ఒరే, వట్టి చేతులతో వస్తే నేనూరుకో నారే. ఆడెక్కడున్నా సరే వెదికి మరీ ప్రటావాల" అన్నాడు హెడ్డు.

నేను మా స్టేషను మెట్లు దిగుతుంటే ఎస్.ఐ. దొర ఎదురయ్యారు. శాల్యూట్ చేసి, సైకిలెక్కాను.

తులసమ్మ ఇంటికెళ్ళాను. ఆడు లేడు. ఆ పేటలోని సారాకొట్టు దగ్గరకెళ్లాను. ఆడు లేడు. వీథులన్నీ తిరిగాను, సందుగొందులూ వెదికాను. ఆడు లేడు. మాది చిన్న టౌను కావడం వల్ల ఓ గంటకల్లా స్టేషన్‌కు తిరిగొచ్చాను.

ఎస్.ఐ. దొర నడుముకి బెల్టు కట్టుకుంటు న్నాడు. ఒళ్లంతా చెమటలు.

స్టేషన్లో ఇంకెవరూ లేరు. దాంతో భయపడుతూనే, "ఇందాకా ఒకావిడొచ్చింది, ఏదిసార్" అని ఎస్.ఐ. దొరనడిగాను.

ఆయన కోపంగా చూసి, అంతలోనే చిన్నగా నవ్వుతూ, "నీ వెనకాలే వెళ్ళినట్టుందే" అన్నారు.

నేనింకేమీ అడగలేక, ఆయన గది దగ్గరున్న స్టూలు మీద కూచున్నాను. ఓ గంట పోయాక, హెడ్డుగారూ, ఇద్దరు కానిస్టేబుళ్లూ వచ్చారు ఒగరుస్తూ. వాళ్లూ అదోలా వున్నారు.

"ఏరా, ఆడు దొరికేడా? ఓరోరి ఆడారీ! ఆఖరికి వట్టి చేతుల్తోనే వచ్చావన్నమాట" అన్నారు హెడ్డుగారు నవ్వుతూ.

"అంతా వెదికేను, ఆడు కన్పించలేదు. ఇంతకీ ఆవిడేదీ" అన్నాను.


"ఆవిడింటికెళ్ళిపోయింది. ఆడికి భయం చెబుతానని మాటిచ్చాను. దాంతో ఎళ్లి పోయింది" అన్నారు హెడ్డుగారు.

మర్నాడు తులసమ్మ ఇంటికెళ్లాను. ఇంటికి తాళమేసి వుంది. పక్కిళ్ల వాళ్లను అడిగితే, "నిన్న రాత్రి నుంచీ రాలేదు. ఎక్కడి కెళ్లిందో" అన్నారు. మళ్లీ మర్నాడు వెళ్లాను. తులసమ్మ మొగుడున్నాడు. తాగుడు మత్తులో వున్నాడు. అతన్నడిగాను.

"ఏమో... పనికెళ్లుంటాది. పక్కూరికెళ్లి ఇయేళే వచ్చేను" అన్నాడు.

ఇంకా కొంచెం స్పృహలోనే వున్నాడు గదాని, మొన్న తులసమ్మ స్టేషన్‌కి వచ్చిన విషయం అతని కోసం నేను వెదికిన విషయం చెప్పాను.

"ఆ..." అని కోపంగా లేవబోయి, భడాలున కింద పడిపోయాడు. తర్వాత కొంచెం సేపట్లోనే గుర్రు పెట్టాడు.




రాత్రంతా 'తులసమ్మ ఏమయ్యుంటుంది' అనే ఆలోచన నన్ను నిద్రపోనీలేదు.

ఉదయం నేను స్టేషన్‌కు వెళ్లేటప్పటికి తులసమ్మ మొగుడు కటకటాల వెనకున్నాడు.

నేను అయోమయంగా అతనివంకా, మా వాళ్ల వంకా చూశాను.

"నాకే పాపం తెలీదు బాబో" అన్నాడు నన్ను గుర్తు పట్టి.

"అవున్నాయనా. నోట్లో వేలెట్టినా కొరకలేవు. మనుషుల్ని మాత్రం చంపేయ గలవు" హెడ్డుగారు వేళాకోళంగా అన్నాడు.

"ఏం జరిగింది సార్"

"ఓరి ఆడారీ. నీకన్నీ విడమర్చి చెప్పాలిరా. ఆ రోజున తులసమ్మ ఎలిపోయిందా? ఈడు నిన్న రాత్రి పూర్నించొచ్చి పీకలదాకా తాగేసి, తులసమ్మని కడుపు మీద కర్రతో కొట్టేసాడు. పాపం, అది గర్భస్రావమై చచ్చి పోయింది. ఈ లోకంలో ఎవరికెంత ప్రేప్తమో ఏం చెప్పగలం రా ఆడారీ. అంతా దైవ లీల" అన్నారు హెడ్డుగారు. ఒకటీ ఒకటీ కలుపు కుంటే అప్పటికి నాకర్థమైంది జరిగిందేమిటో!

"దైవలీల కాదు, నీ లీల. ఎస్.ఐ. దొర లీల" అని అరుద్దామనుకున్నాను.

అరచి అలసిపోవడమే తప్ప ప్రయోజన మేముంది? నిన్న రాత్రి దాకా తులసమ్మ తనింట్లో లేదు. మొన్నటిదాకా తులసమ్మ మొగుడు టౌన్లో లేడు. నిన్న రాత్రి వచ్చాడు. ఇంట్లో వాడొక్కడే వున్నాడు.

తులసమ్మను అప్పటికే మా వాళ్లు దహనం చేసి పుణ్యం కట్టుకున్నారని తెలిసింది. పోస్టు మార్టం చేయించలేదు. నాలుగు రోజుల తర్వాత ఓ కిళ్లీ బడ్డీ వాడు ఎవరికీ చెప్పొద్దని, భయంభయంగా చెబితే తెలిసింది అసలు సంగతి.

"ఎవరితోనూ అనకు గురూ, ఈ బడ్డీయే నా జీవనాధారం. నేను చెప్పినట్టు తెలిసిందంటే ఇక్కడీ బడ్డీ వుండదు. మీ హెడ్డూ, ఇద్దరు కానిస్టేబుళ్లూ ఓ బంగారం బొమ్మను తెచ్చి, ఈ వెనకాల షెడ్డులో వుంచి వాడుకున్నారు" అని మెల్లిగా చెప్పాడతను.

నాకప్పుడు స్పష్టంగా తెలిసింది- తులసమ్మ ఎలా చనిపోయిందో! ఈ బడ్డీవాడు సాక్ష్యం చెప్పలేడు. నేనా నిరూపించలేను! ఇంటికి వెళ్ళేనే గానీ, నా కళ్ల ముందు తులసమ్మ, ఆమె మొగుడూ కదులుతున్నారు. కోపంగా చూస్తు న్నారు! ఆమెకి న్యాయం జరగలేదు. ఆమె మొగుడికీ న్యాయం జరగలేదు. దోషులు అధికారం చెలాయిస్తున్నారు. నిర్దోషి శిక్ష అనుభవించబోతున్నాడు!

ఏదో ఒకటి చెయ్యాలనుకున్నాను. నా కొక్కటే మార్గం తోచింది. ఆ ప్రకారం ఎస్.పి. దొరకు తులసమ్మ స్టేషన్‌కు వచ్చిన దగ్గరనుంచి ఆమె మొగుణ్ణి అరెస్టు వేయడం వరకూ జరిగినవ న్నీ నాకు తెలిసినమటుకు పూసగుచ్చినట్టు రాశాను. కింద నా సంతకం వేసి పోస్టు చేశాను.

ఓ వారం రోజుల తర్వాత నుంచి ఎస్.ఐ. దొరగారి కోపతాపాలూ, రుసరుసలూ, వెటకారాలూ ఎక్కువయ్యాయి. నేను స్టేషన్‌కు వెళ్ళేటప్పటికి "నమస్కారం సార్, దయ చేయండి. ఒరే అయ్యగార్కి కుర్చీ వేయండ్రా" అనీ, "ఏరా, రాస్కెల్, నీకేం చెప్పాను. నువ్వేం చేశావ్, ఒళ్ళు కొవ్వెక్కిందిరా నీకు" అనీ రకరకాలుగా నన్ను వేధించడం మొదలెట్టారు. ఆ తర్వాత ఓ నెల రోజులకు నన్ను ఏజెన్సీ ఏరియాకు బదిలీ చేశారు. 'హమ్మయ్య ఇక ఎస్.ఐ. దొరగారి వేధింపు లుండవు' అనుకుని సంతోషించాను.

అక్కడో మూడు నెలలున్నాను. ఆ కాలంలో అధికారుల ఆదేశాల ప్రకారం నక్సలైట్లతో మేం జరిపిన పోరాటంలో నలుగురు నక్సలైట్లు చనిపోయారు. వారిలో ఇద్దరు నేను జరిపిన కాల్పుల్లో మరణించారు. మరి కొద్ది రోజులకు ఓ యువకుణ్ణి తీసు కొచ్చారు. అతన్ని చెట్టుకు కట్టేసి, ఓ అధికారి ఆదేశానుసారం తుపాకి పేల్చి చంపేశారు. దాన్ని 'ఎన్‌కౌంటర్' అన్నారు.

మళ్లీ నన్ను పాత చోటికే బదిలీ చేశారు. నేను ఏజెన్సీలోనే కనక ఏడుస్తూ పని చేసి వుంటే నన్నక్కడే వుంచి వుండేవారని నాకర్థ మైంది. నేనెప్పుడైతే రెట్టింపు ఉత్సాహంతో అక్కడ పనిచేయడం మొదలెట్టానో, ఇక్కడి ఎస్.ఐ. దొరగారి లక్ష్యం నెరవేరలేదు. దాంతో ఆయన తిరిగి తన దగ్గరకే రప్పించుకుని నన్ను వేధించడం ప్రారంభించారు. నాకొక డ్యూటీ అనేది లేకుండా రాత్రింబవళ్ళు పని చేయించారు. నేను చేసిన ప్రతి పనికీ వంకలు పెట్టడమే. అయినా, నన్ను నేను సముదాయించుకుంటూ, నన్ను నేను తిట్టుకుంటూ కుక్క కంటే హీనంగా సంవత్సరానికి పైగా పని చేశాను.

పదిహేను రోజుల క్రితం పోలీసు పతకాలు ప్రకటించారు. అందులో నా పేరు లేదు. 'ఎన్‌కౌంటర్' చేసిన కానిస్టేబుల్ పేరుంది. ప్రాణాలకు తెగించి పోరాడిన నా పేరు లేదు.

"ఏం సార్, తమకు పోలీసు పతకం రానట్టుందే. దద్దమ్మలకెందుకొస్తుందిలే" అని ఎస్.ఐ. దొరగారు వేళాకోళం చేశారు.

'ఓహో, ఇందులోనూ ఈయనగారి హస్తం వుందన్న మాట' అనుకున్నాను. పెదవి విప్పలేదు.

ఆ తర్వాత తులసమ్మ మొగుడికి ఏడేళ్ళ కఠిన కారాగార శిక్ష పడింది. తీర్పు రాగానే, ఎస్.ఐ. దొరగారు నన్ను పిలిచి చెప్పారు.

"ఊం... కొడకా ఇప్పుడేమయిందిరా? గొప్ప నీతి ముండాకొడుకువి నువ్వేనన్నట్టు ఫోజు కొట్టకు. నేను మంచోణ్ణి కాబట్టే నిన్నిరికించలేదు. ఇంకోసారి ఎస్.పి. గారికీ, డి.జి.పి. గారికీ వెధవ ఉత్తరాలు రాశావో, ఖూనీ కేసులో ఇరికించేస్తాను జాగర్త. ఇప్పుడైనా అర్థమయిందా నేనేటో, నువ్వేటో? ఇక నుంచైనా ఒళ్లు కొవ్వెక్కకుండా చూసుకో" అంటూ దొరగారు పగలబడి నవ్వారు.

ఆ నవ్వు, ఆ అహంభావపు నవ్వు, ఆ అన్యాయపు నవ్వు, ఆ దుర్మార్గపు నవ్వు నా గుండెను తూట్లు పొడిచినట్టయింది. నా ఒంటిపై బుల్లెట్ల వర్షం కురిపించినట్టయింది. నా కళ్లల్లో శూలాలు గుచ్చినట్టయింది.

అంతే. ఆవేశాన్ని ఆపుకోలేకపోయాను. ఎస్.ఐ. దొరగారి సుకుమారపు ముఖం మీద పిడికిలి బిగించి ఒక్క గుద్దు గుద్దేను. వెనక్కి పడిపోయారు. ఆ వెంటనే, మెరుపులా కదిలి, తుపాకీ తీసుకుని దొరగారి దోరదోర ఒంటిని చితగ్గొట్టి, కాల్చి పారేశాను. ఆ సమయంలో స్టేషన్లో ఇంకెవరూ లేకపోవడంతో నా పని సులువయింది.


గబగబా ఇంటికెళ్ళి, సత్యవతితో జరిగింది చెప్పాను. "ఇక నేను లేననుకో" అన్నాను. అబ్బాయిని స్వశక్తితో పెంచమన్నాను. డిపార్టుమెంటు నుంచి రావలసినవి తీసుకోమన్నాను. ఆ రాత్రికి రాత్రే సివిల్ డ్రస్‌లో బస్సులూ, రైళ్లూ మారి నేను పుట్టి పెరిగిన అడవి తల్లి ఒడిలో చేరిపోయాను.

నన్ను పట్టుకుంటేనో, కాల్చివేస్తేనో ఆ వార్త మీరెలాగూ ప్రచురిస్తారని తెలుసు. ఈలోగా, నేనిలా మారడానికి దారి తీసిన పరిస్థితులేమిటో మీ ద్వారా ప్రజలకు తెలియాలనే ఆశతో మీకీ లేఖ రాస్తున్నాను.

భవదీయుడు

ఎం.ఆర్. మల్లన్న

* కాపీ టు ది ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా
* కాపీ టు ది చీఫ్ మినిస్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
* కాపీ టు ది డి.ఐ.జి. ఆఫ్ పోలీస్

Nagarjuna Investment Trust Limited
26, Nagarjuna Hills, Punjagutta, Hyderabad-500 482. Phones: 224403, 37255, 38066.